"నీ మొహం ఆర్నెల్ల నుండి పెండింగు పెట్టి ఇప్పుడు కాదంటే మన పరువు పోతుంది- ఏదో ఒకటి చేసుకో" రాఘవన్ తుపుక్కున ఉమ్మేశాడు.

"ఒకటి కాకపోతే రెండు చేసుకుంటారా! అన్నిటికీ తొందరే! ఇంకా మంచి సంబంధాలు వస్తాయేమో- గమ్మున ఒప్పేసుకుంటే రేపు నష్టపోతామేమో!"శ్యామల ఆదుర్దాపడింది.

"ఆఁ! ముసలాడయ్యేదాకా ఎదురుచూడమను నీ కొడుకును కాని, ఆడపిల్లల తల్లిదండ్రులు అంతకాలం ఎందుకు ఎదురు చూస్తారు? చక్కగా ఓ అయ్యని చూసి పెళ్లి చేస్తారు- చివరికి వాళ్ల మనవరాళ్లని చూడటానికి వీడు వెళ్లాల్సివస్తుంది.!!" భయపెట్టాడు రాఘవన్.

"అబ్బ!అబ్బ! ఇంటికొస్తే మనశ్శాంతి లేకుండా కాకిగోల. కాస్త నన్ను ఆలోచించుకోనివ్వండి" విసుక్కున్నాడు రాజేష్.

"అసలే వాడికి బుర్రతక్కువ. కంగారు- ఆపైన మీ గోల ఇంక వాడి తలకాయ ఏం పనిచేస్తుంది!" శ్యామల వత్తాసు పలికింది.

లోపలికి పోబోయిన రాజేష్ మూడు మారిపోయి వీధిలోకి వచ్చేశాడు.

సిగరెట్టు వెలిగించి గుప్పగుప్పన పొగవదిలాడు . "అరే రాజేశం! ఏంటి వీధిలోనే లాగించేస్తున్నావు-మొగాడివై పోయావా" కొలీగు జగన్ పలకరించాడు. అతని మారు పేరు జంబులింగం. అతనురాజేష్‌తో తరుచూ తిరుగుతుండటం వలన -నక్కజిత్తులు చూపిస్తూ ఉండటం వలన అతగాడికి ఆ పేరు ఖరారు అయిపోయింది.

"నేనైతే అనుకోవడం. లేదు. కాని పెళ్లి పెళ్లి అని వెంటపడుతుంటే గుర్తుకొస్తుంది నేను కూడా మొగాడ్నే అని. " చెప్పాడు.

"పెళ్లి ఎప్పుడు చేసుకుంటావురా!"

"ఏం నువ్వేమన్నా సంబంధాలు తెచ్చావా?"

"నేను తెచ్చేదేంటి? నీ దగ్గరే బోల్డున్నాయిగా".

"నేను వాటిల్లో తేల్చుకోలేకే గదా ఇలా అఘోరిస్తున్నా!"

"సరే! నే తేలుస్తా. నీకు నచ్చినవి రెండు చెప్పు".

"రెండంటే కష్టమే- ఇంక తెగించి చెప్పాలంటే రాధను చేసుకోవాలంటే బాధగా ఉంటుంది. గీతను చేసుకుంటే గుండె గాయం అవుతుంది. అఫ్‌కోర్సు- కావ్యను వద్దనుకుంటే కొంచెం గుబులు వేస్తుంది. సాహితిని చేసుకోకపోతే అన్నం సహించదు."

"అయ్యో! నువ్వు ద్వాపర యుగంలో లేవు- శ్రీ కృష్ణుడివి కావు - మామూలు మనిషివి. సగటు మనిషివి. ఒక భార్యను భరించలేని అర్థకపు భర్తవు- అది గుర్తుంచుకో!"

"ఒరే జగ్గీ! నువ్వు పెళ్లి చేసుకున్నావురా ఇంతకూ."

"మంత్రాల మధ్య తాళి కట్టాను!"

"అది కాదురా- నీకిన్ని సమస్యలు రాలేదా!"

"నేను నీ అంత తెలివిగల వాడ్ని కాదు- మా బాబు ఎవరి మెడలో తాళి కట్టాలో ముందే డిసైడ్ చేసేశాడు- కట్టేశాను".

"అయితే తప్పంతా మా నాన్నదన్నమాట! నన్ను సెలెక్టు చేసుకోమంటాడు".

"అదే తప్పు- నీ వయసెంత- నీ ఎక్స్‌పీరియన్స్ ఎంత- నీ కంటికి అందరూ బాగుంటారు". జగన్ ఓదార్చాడు.

"మరి నీ కంటికి కూడా అందరూ బాగుంటారా!"

"లేదురా- పెళ్ళియిపోయిందిగా- కోతుల్లాగా ఉంటారు!"

"అయితే ఉన్న కోతుల్లో ఓ మంచి కోతిని నాకు సెలెక్టు చెయ్యి-నీ పుణ్యం ఉంచుకోను".

"తర్వాత జీవితమంతా నా మీద పడి ఏడవటానికా? నో...నో...ఎవరి గోతి వారే తవ్వు కోవాలి- దీంట్లో నో హెల్ప్!"

"అంటే ఏంటిరా! పెళ్ళి అంటే గోతిలో పడటమేనా?"

"ఆఁ! నీ స్వాతంత్రాన్ని గోతిలో పూడ్చి పెట్టడమే! అయినా తినబోతూ రుచి అడగడం ఎందుకు? ఆ తాళికట్టు నీ తాడు తెగుతుంది" జగన్ నొక్కి వక్కానించాడు.

"సరే చావు కోసం భయపడ్తూ కూర్చుంటే ఆగుతుందా- ధైర్యంగా ముందుకు వెళ్ళి ఎదుర్కోవాలి-అందుకే నేను సిద్ధంగా ఉన్నా యుద్ధానికి...మరి సెలెక్టు చెయ్యి..."

"నా మీద సొడ్డు వేయకుండా ఉంటే అడుగుచెబుతా..."

దా! అలా లైటులోకి వెళదాం- ఫోటోలు చూపిస్తా చెప్పు."

మిత్రులిద్దరూ పార్కులో ఓ అరుగుమీద కూర్చున్నారు.

జేబులోంచి నాలుగు ఫోటోలు తీసి చెప్పడం మొదలెట్టాడు.

"రాధ! నాకు బాగా నచ్చింది- కుందనపు బొమ్మలాగా వుంది. కాని ఎకనమిక్ అంటే ఆస్తిపాస్తులు నాస్తి! గీత గడుసుపిల్ల- బొద్దుగా అందంగా ఉంటుంది, ఓ మాదిరిగా కట్నం యిస్తారు-కాకపోతే నోరు జాస్తి! ఎంత మాట పడితే అంతమాట అంటుందట! కావ్య కోమలంగా ఉంటుంది. గొప్ప అందగత్తె కాపోయినా- ఖరీదైన ఆభరణాలతో- చీరలతో మెరిసిపోతూ ఉంటుంది. ఇచ్చేది ఎక్కువే! మామగారు అల్లుడ్ని బాగా చూసుకుంటారు... సాహితి విషయానికొస్తే ఎంప్లాయి, మంచి జీతం- దిట్టంగా ఉంటుంది. మొహం అంత బాగోదు గాని చాలా తియ్యగా మాట్లాడుతుంది-ఎప్పడూ హితం పలుకుతూ ఉంటుంది సాహితి!" చెప్పాడు నాలుగుఫోటోలు పక్కన పెట్టి...

"అందుకే ఒకళ్ళ తర్వాత ఒకళ్ళను చూస్తే బాధ ఉండేది కాదు. నలుగురిని ఒక్కసారే చూసి పెండింగు పెట్టుకున్నావు- ఏదీ తేల్చుకోలేక పోతున్నావు" జగన్ సాలోచనగా అన్నాడు.

"మా నాన్న చూస్తే శివాలు చిందులు -పెళ్ళి చేసుకోమని-ఎవర్ని చేసుకోవాలో అర్థం కావడం లేదు. ఒకళ్ళను చేసుకుంటే ఇంకొంకరు కల్లోకి వస్తారు. లక్కీ ఛాన్సు పోయిందని బాధ పడ్తాము" చెప్పాడు తన బాధ.

"సరే! రేపు చెపుతాను- ముందు నాకు టీవీ సెలెక్టు చేసిపెట్టు. షాపుకు పోదం పద!" జగన్ లేవదీశాడు.

ఇద్దరూ కలర్ టీవీలు అమ్మే షాపుకు వెళ్ళారు.

రకరకాల మోడల్సు...కళ్ళు చెదిరి పోతున్నాయి.

డబ్బులు పెట్టే కొద్దీ అందాలు-పనితనం . బ్రాండు నేమ్సే! జగన్-రాజేష్‌ని ఓ టీవీ సెలెక్టు చెయ్యమన్నాడు పన్నెండు వేలలోపు.

రాజేష్-ఓ ఐదు టీవీలు చూసి ఒకదాన్ని సెలెక్టు చేశాడు తీసుకోమని. కొత్త బ్రాండు అయితే ఏం బాగుంది.

"ఇది ప్యాక్ చేయించండి" చెప్పాడు రాజేష్.

"ఎక్స్క్యూజ్‌మి సార్! ఈ టీవీ చూట్టానికి బాగుంది- కాని రిపేరు వస్తే- మూలపడెయ్యాల్సి వస్తుంది. సర్వీసింగు సరిగా లేదు.గ్యారంటీ పీరియడ్ కూడా తక్కువే!

నన్ను అడిగితే అది తీసుకోండి...చూడ్డానికి బాగోలేదు- అంతగా -కాని నాణ్యత ఎక్కువ. కంపెనీ గ్యారంటీఎక్కువ- సర్వీసింగు బాగుంటుంది. ఆపైన మీ యిష్టం!" సేల్సు కుర్రాడు కనకరావు చెప్పాడు వాళ్ళిద్దరికి డీటెయిల్సుగా.

"ఏం జగన్..మరి ఏం చేద్దాం?" రాజేష్ అడిదాడు.

"మరి చూస్తే అది బాగుంది!" జగన్ చప్పరించాడు.

"యస్! వాడు ప్యాకింగ్-గెటప్ మీద తీసుకున్న శ్రద్ధ లోపల మెషిన్ మీద తీసుకోలేదు. లోపల నాసిరకం సరుకు బిగించాడు. తద్వారా లాభం గడిస్తున్నాడు" చెప్పాడు కనకరావు.

"సో అప్పియరెన్సెస్ ఆర్ డిసప్పియరెన్సెస్!" రాజేష్.

" నీ ! బోడి సలహాకు ఓ దండం- నీకో దండం -చెడిపోయిన టీవీని పెట్టుకొని ఏడ్చేకంటే పనిచేసే టీవి కొనుక్కోవడం మంచిది.

స్క్రీన్ మీద బొమ్మ రాగానే మనం చూసేది బొమ్మని కాని - టీవీ క్యాబినెట్‌ను కాదు - కనుక నాకు అది వద్దు - సేల్స్‌బోయ్ చెప్పింది కొనుక్కుంటాను. వాళ్ళ అనుభవం ముందు మనం ఎంత!" జంబులింగం లబలబలాడాడు, అంటే జగన్ గారు.

"ఫైన్ డెసిషన్ - అదే ప్యాక్ చేస్తాను."

"ఇంత కాడికి నా సలహా ఎందుకడిగావురా!" రాజేష్ సందేహం.

"నా బుద్ధి పెడత్రోవ పట్టకుండా అడిగాను - ఇంతకీ నువ్వ నీ పెళ్ళి విషయంలో అమ్మాయిని సెలెక్టు చేసుకున్నావా?"

"ఇంకా ఆలోచిస్తున్నా!"

"నీ మొహం ఆలోచన - ఇంకా దేనికి - ఇద్దరు క్వాలిఫైడ్ అయ్యారుగా - ప్యాకింగ్ చూసి మోసపోవద్దు - రాధ. గీతా మనకొద్దు - అందంలో ఏముంది కొరుక్కుతింటామా? రెండు కాన్పులయితే అప్పలమ్మలా తయారవుతారు."

"అట్లానా. .కాని సాహితిని చేసుకోవాలా? కావ్యనా?"

"రెగ్యులర్ ఇన్‌కం కావాలంటే సాహితిని - జాక్‌పాట్ కావాలంటే కావ్యను. . ఎ బర్డు ఇన్‌హ్యాండ్ ఈజ్‌వర్త్ టు ఇన్ బుష్!"

"అంటే కావ్య వాళ్ళ నాన్నగారు నన్ను సరిగా చూసుకోరా!"

అది నాకు తెలియదు.

కాని సాహితి అయితే నీకు ఖచ్చితంగా నెలనెలా వెన్నెల కురుపిస్తుంది. అందమంటావా. . లైటు ఆర్పేస్తే ఏం కన్పిస్తుంది రాత్రిపూట!" జగన్ హితబోధ చేశాడు.

ఆ రాత్రి సాహితిని చేసుకుంటానని తెగేసి మరీ చెప్పాడు రాజేష్. అతగాడి నిశ్చయానికి రాఘవన్ నివ్వెరపోయాడు. శ్యామల మొహం చిన్నబోయింది మరి.

(ఆంధ్రప్రదేశ్ 8/2001)

